క్లుప్తంగా

చలిచీమలపల్లెలో వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: మండలంలోని చలిచీమలపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రష్మిత 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప, ఎంపీహెచ్ఏ భాస్కర్, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆశావర్కర్ కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని బైటపల్లి పంచాయతీ సచివాలయాన్ని శనివారం ఎంపీడీఓ గౌరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. పని వేళలో సచివాలయ సిబ్బంది కార్యాలయంలో లేనందున వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వలంటీర్లకు కేటాయించిన కుటుంబాలలోని ప్రజలు అర్హత ఉండి లబ్ధి పొందకపోతే దానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంకా పథకాలు అందని వాళ్ల జాబితాను అడిగి తెలుసుకున్నారు.

రేపు చలో విజయవాడ



కరపత్రాలను విడుదల చేస్తున్న కళాకారులు

యాదమరి: కళాకారుల ఆధ్వర్యంలో ఆదివారం చలో విజయవాడ చేపట్టనున్నట్లు మండల కళాకారుల సంఘం అధ్యక్షులు రామచంద్ర స్వామి తెలిపారు. ఆయన శనివారం చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. విజయవాడలో నిర్వహించే జై భారత్ సామాజిక విప్లవ రణభేరి కార్యక్రమంలో కళాకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పది పరీక్ష కేంద్రం పరిశీలన

పూతలపట్టు: మండలంలో ఎర్రచెరువుపల్లి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. చివరి పరీక్షకు 96 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కలికిరిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

ఐరాల: మండలంలోని కలికిరిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపాలి

తవణంపల్లె: చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపాలని డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో ముఖాముఖీ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని వివరించారు. తవణంపల్లెలో గ్రేడింగ్ బిల్డింగ్ పనులు చేపట్టి త్వరలో రైతులకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మహిళా మార్ట్‌ను తనిఖీ చేశారు. పీడీతోపాటు ఏపీఎంలు సూరి, సుధారాణి, రవి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై గ్రామ సభ

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోటలో శనివారం సర్పంచ్ పద్మజారాణి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో రోడ్డు, దారి, భూ సమస్యలపై చర్చించారు. రేషన్ షాపులలో వృద్ధులకు వేలిముద్ర పడడం లేదని వాటిని సరిచేయాలని గ్రామస్తులు విన్నవించారు.

పీహెచ్‌సీల్లో పెద్దాస్పత్రి సేవలు



గుడిపాల పీహెచ్‌సీకి చేరిన అధునాతన పరికరాలు



ల్యాబ్ పరీక్షలు చేస్తున్న గది

- అందుబాటులోకి 63 రకాల వైద్య పరీక్షలు
- శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు
- నెలాఖరు నుంచి సేవలు ప్రారంభం

గుడిపాల: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పెద్దాస్పత్రి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్రీ ఎన్‌లైజర్, యూరిన్ ఎన్‌లైజర్, టీబీ ఆర్టీ పీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చింది. ఇప్పటివరకు పీహెచ్‌సీల్లో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరికరాలతో మొత్తం 63 రకాల వైద్య పరీక్షలు చేసే అవకాశం వచ్చింది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను యమించారు. చిత్తూరులో 22 రోజుల పాటు ఈ ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు.

ఎంతోమేలు...

గతంలో పీహెచ్‌సీలలో చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆసుపత్రి, లేదా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థికభారం అయ్యేది. అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటివరకు రోగికి ఖచ్చితమైన వైద్యం అందేది కాదు. పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని కొందరు పేద రోగులు సైతం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీలలోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నరసింహమూర్తి చెప్పారు.

ఇవీ చేసే వైద్య పరీక్షలు

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, లోటస్‌బ్లడ్ సెల్ కౌంట్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్ఐవీ, హెపటైటిస్-బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్‌టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

పరికరాలు పీహెచ్‌సీకి చేరాయి



రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీకి చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా కొంత శిక్షణ ఇచ్చారు. మరో వారం రోజులు శిక్షణ పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే పీహెచ్‌సీల్లో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి.

– వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్, గుడిపాల

త్వరలోనే అందుబాటులోకి



ఈనెలాఖరు నాటికి 63 రకాల వైద్య పరీక్షలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. ఇకపై పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు పేద రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. వెంటనే అవసరమైన వైద్యాన్ని అందిస్తాం. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వం ఈ ఆస్పత్రిలోనే అన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది.

– సుకన్య, పీహెచ్‌సీ డాక్టర్, గుడిపాల

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ఐరాల: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు పంట సాగులో ఖర్చు తగ్గడంతోపాటు, అధిక దిగుబడులు వస్తాయని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.పైపల్లె ఆర్బీకే పరిధిలో శనివారం ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో భూమి ఆరోగ్యం, భూసార పరీక్ష చేసే విధానంపై ఉద్యాన, వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్ష చేసుకోవడం ద్వారా నేలలోని సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యత తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులు పంట సాగు చేపట్టిన ప్రతి సారీ భూసార పరీక్షలు చేయించడం వల్ల భూమిలో ఉన్న పోషకాల విలువ తెలియడమే కాకుండా ఆ ఏడాది ఏ పంటను సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందో తెలుస్తుందన్నారు. వర్షాధార భూముల్లో మూడేళ్లకు ఒకసారి, నీటి ఆధారిత పంటలను పండించే భూములలో మూడు సీజన్లకు ఒకసారి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆర్బీకే సిబ్బందితో కలిసి సమీప పొలాల్లో పరీక్షల కోసం మట్టి సేకరించారు. కార్యక్రమంలో వీఏఏలు హేమంత్, సంతోష్, రెడ్డెప్ప, లక్ష్మీదేవి, వీహెచ్ఏలు కావేరి, చైతన్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందికి, రైతులకు భూసార పరీక్షలపై శిక్షణ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ చెట్టునీడలోన, గట్లు, కాలిబాటల వెంబడి మట్టి సేకరణ చేయరాదన్నారు. బీడుగా ఉన్న భూముల్లో మట్టిని సేకరించరాదని స్పష్టం చేశారు. ఏప్రిల్, మే లో మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేస్తే ఫలితం బాగుంటుందన్నారు. అనంతరం వ్యవసాయశాఖ సిబ్బంది, కాశిరాళ్ల గ్రామంలోని భూముల్లో మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ ఏఓ చరిత, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కాశిరాళ్ల పంచాయతీలో మట్టిని సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఘనంగా ఓనమ్ సంబరం



చిత్తూరు రూరల్: నగరంలోని ప్రశాంత్ నగర్‌లో కొలువైన శ్రీ శాస్త్రాగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఓనమ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేరళలో అత్యంత ప్రజాదరణ పొందిన, అతి పెద్ద పండుగ ఓనమ్. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పడి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఓనమ్ సంబరాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 19వరకు ఆలయం తెరిచే ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఓనమ్ సంబరంలో భాగంగా అయ్యప్ప స్వామి పడిపూజ చేస్తున్న అర్చకులు

వరసిద్ధి వినాయక స్వామి సేవలో ప్రముఖులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయ క స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, లోకాయుక్త డైరెక్టర్ నరసింహ రెడ్డి, ఐటీ కమిషనర్ జీవన్‌లాల్, తెలంగాణ ఎమ్మెల్యే రాములు నాయక్ వేర్వేరుగా స్వామివారి దర్శనానికి విచ్చేశారు. ఆలయ ఈఓ వెంకటేశు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రేణుక, తహసీల్దార్ సుశీల, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



లోకాయుక్త డైరెక్టర్ నరసింహారెడ్డి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఈవో వెంకటేశు

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, వచ్చే ఎన్నికల్లోనూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. మండలంలో 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు అంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని వారు ప్రజలను కోరారు.

మరోసారి సీఎంగా చేసుకుందాం

యాదమరి: జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని గ్రామీణ ప్రజలకు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కీనాటంపల్లె, 14 కండ్రిగ ముస్లింవాడలో శనివారం "జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్" కార్యక్రమం నిర్వహించారు. ఆయన మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారి అనుమతితో గోడపై స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, నాయకులు మనోహర్ రెడ్డి, దానివేలు, కబీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికిస్తున్న పార్టీ నాయకులు



కీనాటంపల్లెలో పర్యటిస్తున్న జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

గంగాధరనెల్లూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా ఏర్పడిందని ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి అన్నారు. మండలంలోని మహదేవమంగళం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం సర్పంచ్ ఉమ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశించిన 5 ప్రశ్నలకు జవాబులు రాబట్టారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు గ్రామంలో ఆలయ నిర్మాణానికి శనివారం తుంబకుప్పం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ భరత్‌కుమార్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో మరియమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరడంతో ఆయన రూ.10 వేలు నగదును గ్రామపెద్దలకు అందజేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అగ్ని ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండోవరోజు బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల పై ఎలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పించిన సిబ్బంది

చిన్నతనం నుంచే విద్యాబుద్ధులు నేర్పాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చిన్నతనం నుంచే విద్యాబుద్ధులు నేర్పాలని వక్త ఎస్ఎస్‌కే రాజా అన్నారు. నగరంలోని రాంనగర్ కాలనీలో శనివారం యూరో కిడ్జ్ ప్రీ స్కూల్ అధినేత లతా ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో సుప్రీం కోర్టు న్యాయవాది రాగసందేశ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం విద్య, క్రీడలు, ఇతర పోటీల్లో రాణించిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.

నూతన జేసీకి పుష్పగుచ్ఛంతో స్వాగతం

చిత్తూరు కలెక్టరేట్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుకు కలెక్టరేట్‌లో శనివారం ఘన స్వాగతం లభించింది. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఆయనను పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది, చిత్తూరు కమిషనర్ అరుణ, వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం, డివిజన్ అధ్యక్షులు మార్కొండ తదితరులు కలిశారు.



జేసీని కలిసిన డీఆర్వో రాజశేఖర్

జగనన్న పాలనలో మహిళలకు గౌరవం



సంక్షేమ లబ్ధిని వృద్ధురాలికి తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



టి.పుత్తూరులో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు ఎంతో గౌరవం, ప్రాధాన్యత లభిస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక 41వ డివిజన్ తోటపాళ్యం–2 సత్యమ్మగుడి వద్ద నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఏ పథకం ప్రవేశపెట్టినా అది మహిళల పేరున అందించడమే జగనన్న వారికిచ్చిన గౌరవమని పేర్కొన్నారు. నాడు చంద్రబాబు చేసిన దోపిడీయే ఆయనకు ఈ గతి పట్టించిందన్నారు. డివిజన్ కార్పొరేటర్ కుప్పమ్మ, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ నాయకులు సీతాపతి, చిట్టి, హరి, పురుషోత్తం పాల్గొన్నారు. లాలూగార్డెన్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం హైరోడ్డులోని మసీదులో శనివారం జరిగిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తవణంపల్లె: "ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికే మీ ముంగిటకు వస్తున్నా...అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం." అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని టి.పుత్తూరు దళితవాడ, టి.పుత్తూరు, కంపలపల్లె, దిగువ మోదలపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రెడ్డిబాబు, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, వ్యవసాయాధికారి ప్రవీణ్, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, ఏఈలు గురువారెడ్డి, ఈశ్వర్, శ్రీధర్, కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.